

# తప్పెవరిది?

డొడ్డుచర్ల లీలాలక్ష్మి

ట్రైన్ కదిలింది. పెట్టే, బెడ్డింగ్ అన్నీ జాగ్రత్తగా సర్దుకుని సీట్లో కూర్చున్నాను.

చీకటి పడుతూండటంతో లైట్లు వెలిగాయి.

సిగరెట్ వెలిగించి పక్కన ఉన్న వ్యక్తి వంక చూశాను.

నలభై అయిదేళ్ళుంటాయతనికి. తెల్లని లాల్చీ తొడుక్కున్నాడు.

"మీ పేరు తెలుసుకోవచ్చా!" పరిచయం చేసుకోవటానికి అడిగాను.

"గోపాలం. మీ పేరు?" అడిగాడతను.

"రఘువల్లభ" అన్నాను నెమ్మదిగా.

అతను రెండుక్షణాలు నావంక తదేకంగా చూస్తూ—

"రఘువల్లభ అంటే... ప్రఖ్యాత రతయితలా మీరు?" అడిగాడు.

"అదేం అలా ప్రశ్నించారు ?" నవ్వుతూ అడిగాను.

"ఏం లేదు. అతని రచనలు చాలా చదివాను అందుకని" అన్నాడు.

"నేనే అతనిని" అన్నాను కాస్సే పయ్యాక.

ఎందుకో అతని వదనంలో నా ప్రతిభకు మించిన ప్రశంస కనిపించింది. నేను చటుక్కున తలవంచుకుని ఆ తరువాత కిటికీలోనుండి బయటకు చూడటం మొదలుపెట్టాను.

నన్ను రచయితగా ఎదుటిమనిషి గుర్తించటం నాకంతగా ఇష్టంలేదు. నా చుట్టూ ఉన్న జనంలో నా మీద అభిమానమున్నవారూ ఉండచ్చు. ఇష్టపడనివారూ ఉండచ్చు. ఎందుకో ఎవ్వరితోనైనా సాధారణవ్యక్తిగా మాట్లాడితేనే ఏదో తృప్తి ఉంటుంది. రచయితగా వారు గౌరవిస్తూ మాట్లాడితే ఏదో అడ్డుతెర నన్ను పరిపూర్ణంగా మాట్లాడనీయదు. అందుకే మాటలు మార్చేశాను.

"హైద్రాబాద్‌లో ఎవరుంటారు ?"

"హైద్రాబాద్‌కి కాదు. అక్కడనుంచి సంగారెడ్డి బస్ ఎక్కాలి. అక్కడ మా అమ్మాయి ఉంది. హరిజనవాడలో దాని మొగుడు మంచివాడు కాదు. వదిలేస్తానంటున్నాడట. ఇద్దరికీ రాజీ కుదురుద్దామని వెళుతున్నాను" అన్నాడతను.

ఎందుకో వివరాలు కనుక్కోవాలనిపించినా అడగలేకపోయాను. ఎప్పుడు ప్రయాణం చేస్తున్నా ఇలా చుట్టుపక్కల వారితో మాట్లాడుతూంటాను. అలా మాట్లాడటం వలన కథలకి మంచి వస్తువు దొరుకుతుంది, వాస్తవికమైన రచన ఉద్భవిస్తుంది.

పరిశీలన అనేది పట్టే కలం ప్రతివాడి లక్షణం. పాత్రలను నడపటానికి ముందు స్వభావాలు పరిశీలించటం ఎంతైనా అవసరం. అందుకే ఇలా ప్రతి ఒక్కడితో స్నేహం చేస్తాను. పాత్రలు ఏవైనా నచ్చితే డైరీలో ఎక్కించేస్తూంటాను. ఆ తరువాత పత్రికలలోనూ ఎక్కుతాయి.

"ఏమిటోనండీ ! ఇలా ఉంటున్నవి కొంతమంది భార్యాభర్తల బతుకులు. అనవసరమైన పట్టుదలలకి పోయి జీవితాన్ని పాడుచేసుకుంటున్నారు" అన్నాడు.

అతను చెప్పిందంతా వింటున్నాను.

"మీరెక్కడికి వెళతారు హైద్రాబాద్‌లో?" అడిగాడతను.

"చంద్రకాంత్ అని నా ఫ్రెండ్ ఒకడు హైద్రాబాద్‌లో ఉంటున్నాడు. అతన్ని కలవటానికి" అన్నాను.

ఆ తరువాత మా ఇద్దరి మధ్యా ఎక్కువ సంభాషణలు జరగలేదు.

నా ఆలోచనలిప్పుడు చంద్రం చుట్టూ తిరుగుతున్నాయి.

టెలిగ్రాం అందిందో లేదో ! వాడిని

చూసి ఎన్నాళ్ళయింది! సంపూర్ణతో కలిసి వస్తాడేమో!"

ఇలా ఆలోచనలు ఎన్నో మలుపులు తిరుగుతున్న సమయంలో హైద్రాబాద్ వచ్చేసింది.

ఆలోచనలకు స్వస్తిచెప్పి లేచాను.

"మళ్ళీ కలుస్తానో లేదో, ఈ సారి వ్రాసేటప్పుడు ఇలాంటి, అంటే విడిపోయిన భార్యాభర్తలకి పరిష్కార మార్గం సూచిస్తూ వ్రాయండి. అలాంటివి చదివితేనైనా వాళ్ళు తిరిగి కలుస్తారు" అన్నాడు.

"అలాగేనండి" అన్నాను నవ్వుతూ.

గోపాలం కూడా నాతోపాటే దిగి సంగారెడ్డి బస్సెక్కాడు.

దిగిన నాకు అంతగా వెతుక్కునే పనిలేకుండా ఎదురుగా చంద్రం కనిపించాడు.

''చంద్రం!" సూట్ కేస్‌లు కిందపెట్టి వాడి భుజాన్ని అదిమి పట్టుకున్నాను. వాడు మౌనంగా నా సూట్ కేస్‌లు తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఏమిట్రా ఆ నేలచూపులు! నిన్ను చూస్తే మగాడ్నిచూసి తలవంచుకునే ఆడపిల్ల గుర్తొస్తుంది" అన్నాను.

వాడు నవ్వలేదు సరికదా మాట్లాడనైనాలేదు. ఎందుకో వాడి ప్రవర్తన నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అదేమిటలా ఉన్నావు ?" అన్నాను వాడి పక్కనే నడుస్తూ.

"ఏంలేదు" అన్నాడు.

"కాదు. ఏదో ఉంది. లేకపోతే నువ్వెప్పటికీ ఇలా ఉండవు" అన్నాను.

వాడిలో మిన్ను విరిగి మీదపడినా చెదరని గాంభీర్యం కనిపించింది.

"సంపూర్ణ ఎలా ఉందిరా ?" అన్నాను.

వాడు ఓసారి నావంక తేరిపారా చూస్తూ-

"ఇంటికెళ్ళాక మాట్లాడుకుందాం" అన్నాడు ఆటో మాట్లాడుతూ.

నాకు బొత్తిగా వాడి ప్రవర్తన అర్థం కావటంలేదు. 'కానీ అతనిలో ఏదో అనూహ్యమైన మార్పు వచ్చిన మాట మాత్రం నిజం' అనుకున్నాను.

ఇంటికి చేరేసరికి ఎనిమిది దాటింది.

"తాళం ఎందుకు వేసిఉంది ? సంపూర్ణ లేదూ ?" అన్నాను ఆశ్చర్యంగా.

"లేదు" ముక్తసరి జవాబు.

"ఎక్కడుంది ?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇప్పుడు నాకు సెలవలేగా. విషయమంతా తీరికగా చెబుతాను గానీ త్వరగా పళ్ళు తోముకో, కాఫీ కలుపుతాను" అన్నాడు.

పళ్ళు తోముకుని స్నానంచేసి మరీ వచ్చాను. ఈ లోపల చంద్రం కాఫీ కలిపి ఉంచాడు.

అన్యమనస్కంగానే కాఫీ తాగు

తున్నాను. 'సంపూర్ణ ఎక్కడికెళ్ళినట్లు? హైద్రాబాద్‌కి ఉద్యోగంకోసం వెళు తున్నాను అని చంద్రం ఉత్తరం వ్రాసి నప్పుడు ఇద్దరూ కలిసి వెళ్తారని అను కున్నాను. కానీ ఇదేమిటి?' చంద్రం ముఖం చూస్తూంటే అడగటానికి ధైర్యం చాలటంలేదు.

ఏడున్నర దాటాక హోటల్‌నుండి కారియర్ తెచ్చాడు చంద్రం.

"నేనొచ్చి నీకు శ్రమ కలిగిస్తు న్నాను" అన్నాను నొచ్చుకుంటూ.

"అదేం లేదు. నీ రాక నాకు ఆనం దమే కలిగిస్తుందెప్పుడూ," అన్నాడు కారియర్‌నుండి అన్నం వడ్డిస్తూ.

"అదేమిటలా ఆలోచిస్తూ కూర్చు న్నావు?" ఉన్నట్లుండి అన్నాడు చంద్రం.

"ఏమీలేదు. బస్‌లో నా పక్కన కూర్చున్న వ్యక్తిగురించి," అన్నాను బొంకుతూ.

"నీకీ అలవాటు ఇంకా పోలేదన్న మాట. నేనింకా సంపూర్ణగురించి ఆలో చిస్తున్నావేమో ననుకున్నాను" అన్నాడు.

ఈసారి కాస్త చొరవ తీసుకోవచ్చని పించింది.

"చంద్రం! ఒకటడుగుతాను. నిజం చెప్పు. సంపూర్ణ ఏది?"

నాలోని ఉద్రేకతని చూడగానే వాడి ముఖంలో రంగులు మారాయి.

"ఇక్కడలేదు"- పొడిగా జవా బిచ్చాడు.

"ఆ సంగతి తెలుస్తూనే ఉంది. ఎక్కడుందో చెప్పు" అన్నాను.

"భర్తకీ భార్యకీ తగాదాలొస్తే ఆడది ఎక్కడ ఉంటుంది. పుట్టింట్లోనే ఉంది."

"అయితే సంపూర్ణకి పుట్టింటివారు లేరుగా...ఆమెకు ఉన్నదల్లా నువ్వేగా!"

"అదేంకాదు. ఆమెకు కావాలంటే ఎంతోమంది ఉన్నారు. అదీగాక తండ్రి ఇచ్చిన ఆస్తి ఉంది. ఆమెకేం కావాలి! దరాగా ఉంది."


"నీకు చెప్పటానికి సిగ్గులేదూ! సంపూర్ణని ఎలా ఒంటరిగా వదిలెయ్య గలిగావు! పుట్టింటివారు కూడా లేని ఆ ఆడపిల్లని జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రేమను పంచివ్వాలి. అంతేగానీ నీలా.. ఛీ ఛీ" ఉద్రేకంగా అరిచాను. అన్నం సయించలేదు. చేతులు కడుక్కొని మంచంమీద పడుకున్నాను.

"అందుకే రఘూ! నీకు నేను వచ్చి నప్పటినుండీ చెప్పలేదు. సహం తిండి తిని అన్నం ముందునుంచి లేచావు" అన్నాడు చంద్రం.

"కడుపు నిండిపోయింది చంద్రం ఈ వార్త విన్నాక. మీరిద్దరూ ఎంతో అనురాగంతో ఉంటారనుకుని వచ్చాను."

"నా తప్పేమీ లేదు రఘూ! అంతా సంపూర్ణ తప్పే! ఆమె వైఖరిలో మార్పులేదు" అన్నాను.

"అసలేం జరిగిందో వివరంగా




చెప్పు. ఆమె చేసిన తప్పేమిటి ?" అన్నాను.

ఓ సారి నిటారుగా, నిశబ్దంగా, చలనం లేకుండా కూర్చున్నాడు. ఆ తరువాత-

"రఘూ! గులాబీ పువ్వును చూడగానే ఆకర్షింపబడ్డాను. కానీ బాగా దగ్గరికెళ్ళాక వెనక దాగిన ముళ్ళు హృదయంలో గుచ్చుకున్నాయి."

"అసలు ఏం జరిగింది చంద్రం ?" ఆదుర్దాగా అన్నాను.

తడారిపోతున్న గొంతుని, అతి కష్టంమీద పెగుల్చుకుని- "చెబుతాను రఘూ! కానీ ఇందులో తప్పు ఎవరిదో నువ్వే చెప్పాలి" అన్నాడు.

"సరే కానీ'' అన్నాను.

వాడు చెప్పటం మొదలుపెట్టాడు. చెబుతూనే ఉన్నాడు. అది కథ కాదు. నిజమైన జీవితం. రెండు పాత్రల నడుమ నడచిన సంఘటనలు. అయితే ఇందులో తప్పు ఎవరిదో చెప్పాలి- అందుకే చెవులు రిక్కించి విన్నాను. చెప్పటం పూర్తిచేసి- "ఇప్పుడు చెప్పు రఘూ! నేను చేసినది తప్పా! రచయితగా నువ్వు జీవితాన్ని ఎన్నో కోణాలనుంచి చూశావు. నా పరిస్థితిని నువ్వు అర్థంచేసుకోగలవు కదూ!" అన్నాడు.

మౌనంగా ఉండిపోయాను కాసేపటిదాకా. తరువాత-

"ఇప్పుడే తప్పు ఎవరిదో నిర్ణయించలేను చంద్రం! ఒక వ్యక్తే అందరి వ్యక్తుల తరఫునుండీ చెబితే సరియైన తీర్పు చెప్పటం కష్టం. సంపూర్ణని కలి

శాక, ఆమెనుండి విషయం రాబట్టాక కానీ ఏమీ చెప్పలేను.

"నా మీద నమ్మకం లేదన్నమాట" అన్నాడు.

"అదికాదు. సంపూర్ణ అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలి. సంపూర్ణ అడ్రెస్ ఉంటే ఇవ్వు. వెళ్ళేటప్పుడు ఆమెని కలుస్తాను" అన్నాను.

చంద్రం డ్రాయర్ తెరిచి అడ్రెస్ వ్రాసిచ్చాడు పేపరుపైన.

అడ్రెస్ తీసి సూట్ కేస్‌లో పెట్టాను.

ఆ రాత్రి చంద్రం నిద్రపోయాక లేచి లైటు వేశాను. డైరీ తెరిచి వ్రాయటం మొదలుపెట్టాను. చంద్రం చెప్పిన ప్రతి విషయం డైరీలో వ్రాసుకున్నాను.

ఈ కిందిది చంద్రం కథ.

చంద్రం : అమ్మపోయాక నిలువ నీడలేని నాకు ఎంతో ఆదరంతో చేయూతనిచ్చారు మామయ్య. అప్పుడే నా జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమయింది. సంపూర్ణతో అదే నా తొలి పరిచయం. రాకపోకలు లేక పోవటం మూలాన అంతవరకూ నేను సంపూర్ణను చూడనేలేదు.

"హలో బావా !" పంజాబీ డ్రెస్‌లో, అప్పుడే వికసించిన రోజాలా ఉంది సంపూర్ణ.

'అందం' చాలా విచిత్రమైనది. కొంతమంది ఎన్నో అలంకరణలు చేసినా అందంగా కనిపించరు. కానీ కొంతమందిలో విచిత్రమైన శక్తి ఉంటుంది. అది వాళ్ళ నవ్వులోనూ, మాటల్లోనూ, అణువణువునా కనిపిస్తూ ఎదుటి మనిషిని తమ వైపుకు లాక్కుంటుంది. అలాంటి శక్తి ఉన్నవారు అందమైనవారు. అలాగే సంపూర్ణ నన్ను మొదటిచూపులోనే ఆకర్షించింది. 'బావా' అన్న ఆ తీయని పిలుపుకి కాస్త మనసు చలించి ఏదో అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది.

"నువ్వు వస్తావని నాన్నగారు చెప్పారు. అప్పటినుంచీ నిన్ను చూడాలని ఎదురుచూస్తూ ఉన్నాను" అంది.

మొదటి పరిచయంతోనే ఏకవచన ప్రయోగం చేస్తున్న ఆమెని చూస్తే నాకు ఆశ్చర్యం కలిగింది.

సంపూర్ణ కాసేపు మాట్లాడి కాఫీ తేవటానికి వెళ్ళింది.

''ఎదిగీ ఎదగని మనస్తత్వానికి ప్రతిరూపం సంపూర్ణ ! అమయాకురాలైన ఈ పిల్ల లోకంలో నేడు జరిగే అన్యాయాలకు బలైపోదుకదా అని ఎప్పుడూ అనుకుంటూంటాను. దాని గురించే నా బెంగంతా !" అన్నారాయన నిట్టూరుస్తూ.

సంపూర్ణని ఇంకోసారి చూద్దామని ముందుకు ఆసక్తిగా వంగిన నాకు నిరుత్సాహమే ఎదురైంది.



పనిమనిషి తెచ్చిన కాఫీని అందు కున్నాను.

ఇంతలో సన్నగా పాట వినిపిస్తోంది. రికార్డ్‌ప్లేయర్‌లోనుండి "భామనే, సత్యభామనే !" అంటూ ఎవరిదో గొంతు పాడుతోంది. తదనుగుణంగా నాట్యంచేస్తున్న చప్పుడు, గజ్జెల సవ్వడులు.

"సంపూర్ణ డాన్స్ చేస్తుందా మామయ్యా ?" అడిగాను.

"దాని మనసెప్పుడూ డాన్స్ పైనే. చాలా ప్రోగ్రాంలు ఇచ్చింది," అన్నారు.

మౌనంగా వింటూ కూర్చున్నాను. ఆ తరువాత ఓ గంటకి స్నానం ముగించి పైకి వెళ్ళాను.

ఇంకా డాన్స్ ప్రాక్టీస్ చేస్తోందామె.

"కూర్చో బావా !" అంది.

స్వేద బిందువులు ముఖంమీద మెరుస్తున్నాయి. అసలే తేత శరీరమేమో ఎరుపెక్కింది.

"ఎల్లుండి కాలేజీలో డాన్స్ ప్రోగ్రాం ఉంది– ఎలా చేస్తున్నానో నువ్వే చెప్పాలి" అంది.

''చెయ్యి మరి" అన్నాను.

ఆమె చెయ్యటం మొదలుపెట్టింది.

ఆమె ఒక్క కాలిలోనే కాదు, ముఖంలో కూడా భావాలు స్పష్టంగా కనిపి స్తున్నాయి.

"చాలా బాగా చే స్తు న్నా వు సంపూర్ణా !" మెచ్చుకోలుగా అన్నాను.

ఆమె నవ్వింది మిన్నుల పున్నమి వెన్నెలలా. ఆ తరువాత నా పక్కనే కూర్చుంది.

"నీకు డాన్స్ అంటే చాలా ఇష్టంట కదూ !" అన్నాను ఏం మాట్లాడాలో తోచక.

"అవును. కానీ ఈ రోజుల్లో దానికి సరియైన ప్రోత్సాహం ఇచ్చేవారే కన బడటంలేదు. ఆడపిల్ల ఓ వయసొచ్చాక స్టేజీ ఎక్కటమే,తప్పుగా భావిస్తున్నారు. కళారాధనకి వయసుతో సంబంధం లేద న్నది నా ఉద్దేశ్యం" అన్నది.

తనయొక్క మనోభావాలు సంశయం లేకుండా పైకి చెబుతున్న ఆమె స్వభా వాన్ని మనసులోనే అభినందించాను.

మొదటిరోజుతోనే సంపూర్ణ గురించి చాలా తెలుసుకున్నాను.

చనువుగా, చెలిమిగా చూసే ఆ చూపులు, నెమలి పురివిప్పుతూన్నట్లున్న దట్టమైన ఆ కనురెప్పలు... ఆమెలోని చాలా అందాలకు నా మనసు ఏదో తీయని బాధతో మూలిగింది.

"మా కాలేజీ డేకి నువ్వు తప్పకుండా రావాలి" అంది.

"తప్పకుండా" అన్నాను వెంటనే ఒప్పేసుకుంటూ.

కాలేజీ డే వచ్చింది. సంపూర్ణ నాలుగు గంటలకే వెళ్ళిపోయింది. రావు గారు ఏదో పని ఉందని చెప్పి రాలేదు. చివరికి డ్రైవర్ని వెంటతీసుకుని ఒంటరి గానే వెళ్ళాను.

స్టేజీమీద మరీ అందంగా, అచ్చం సత్యభామలా కనిపించింది సంపూర్ణ.

డాన్స్ ప్రోగ్రాం అయ్యాక సంపూర్ణ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను.

దూరంగా ఎంతోమంది మగవాళ్ళ తోనూ, ఆడపిల్లలతోనూ మాట్లాడుతూ కనిపించింది సంపూర్ణ.

డ్రైవర్ ముందుసీట్లో కూర్చున్నాడు. నేనూ, సంపూర్ణా వెనకసీట్లో కూర్చు న్నాము.

"నాన్నగారు కూడా ఉంటే బాగుం డేది !" ఎందుకో ఆమె గొంతు జీరవోయింది.

"అవును. రమ్మన్నా రాలేదు. ఏదో అర్జెంట్ పనుందట."

సంపూర్ణ కళ్ళల్లో నీరు తిరగటం గమనించాను.

"ఆయనకు నేను డాన్స్ చెయ్యటం ఇష్టంలేదు," అంది కాసేపయ్యాక.

"అంటే ?"

"తన కూతురు డాన్సర్ అంటే ఆయనకు నామోషీ" అనేసింది.

నేనేమీ బదులు చెప్పలేదు.

ఇంటిముందు కారు ఆగేదాకా ఎవరి ఆలోచనలలో వారు గడిపాము.

సంపూర్ణ ముభావంగా లోపలికి నడిచింది.

రావుగారు ముందు వరండాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నారు. అడుగుల చప్పుడుకి తలెత్తిన ఆయన చూపులు తీక్షణంగా సంపూర్ణను చూశాయి.

"ముందు లోపలికెళ్ళి ముఖం కడుక్కో"-ఆయన గొంతులో నిరసన.

సంపూర్ణ గబుక్కున లోపలికి నడిచింది.

"ఇది చంద్రం, ఈ పిల్ల వరస. అంతమంది ముందు డాన్స్ చెయ్యక పోతేనేం," అన్నారాయన.

నేను ఆయన మనసులో బాధను అర్థంచేసుకోగలను. అయితే సంపూర్ణ ఈ కాలపు పిల్ల. తండ్రిలో దృఢత్వం ఎక్కువగా లేకపోవటంచేత ఆడింది ఆట, పాడింది పాట అవుతోంది.

ఆ మరునాడే సాయంత్రం 'క్లబ్‌కి వెళుతున్నాను' అంటూ బయలుదేరింది సంపూర్ణ.

ఆమె 'లయన్స్' క్లబ్‌లో మెంబరట. త్వరలో సెక్రెటరీ కాబోతున్నదట.

"నువ్వూ మెంబర్‌వి కాకూడదూ!" అందామె.

"నాకు అలవాటులేదు. ఇప్పుడు అలవాటు చేసుకోలేను" అన్నాను.

ఆమె సూటిగా నావైపు చూసింది.

ఇంతలో బయట కారు హారన్ వినిపించింది.

"నే వెళుతున్నాను" చెప్పులు టకటకలాడిస్తూ కదిలి వెళ్ళింది సంపూర్ణ.

ఎవరో, సంపూర్ణ బాయ్ ఫ్రెండ్ అనుకుంటాను, నవ్వుతూ డోర్ తెరిచాడు. సంపూర్ణ ఎక్కింది. కారు కదిలింది. రెప్ప వేయటం మరచిపోయి ఆ దృశ్యంవైపు చూస్తూండిపోయాను. తుఫాను రేగినట్లు మనసు అల్లకల్లోలమైపోయింది.

"చంద్రం !"

మామయ్య గొంతు వినిపించేసరికి తడబాటును అణుచుకుని తలెత్తాను.

"చంద్రం ! నేనొకటి అడుగుతాను. ఏమీ అనుకోవుగా !"

"అడగండి." నిదానంగా అన్నాను.

"సంపూర్ణని నువ్వే చేసుకోవాలి. దానికి అయిన సంబంధమే అన్ని విధాలా యోగ్యమైనదనిపిస్తోంది. ఇంకొకళ్ళు దాని ప్రవర్తన నచ్చక దానికి అన్యాయం చెయ్యొచ్చు. నువ్వు సంపూర్ణని చేసుకుంటే నాకు నిశ్చింతగా ఉంటుంది."

అనుకోని ఆ మాటలకి ఆశ్చర్య పోయాను.

"ఉద్యోగం లేనిది పెళ్ళి ఏమిటి మామయ్యా?" అన్నాను.

"నీకు ఉద్యోగం వచ్చాకే చేసుకో!" అన్నారాయన.

'ఈయన ఎంత నిండైన మనిషి. ఇల్లు అశాంతినిలయంలా ఉన్నా, ఒక్కగానొక్క కూతురు కళ్ళముందే పాడైపోతున్నా, ఎండకీ వానకీ తల ఒగ్గని వృక్షంలా ఎంత గంభీరంగా ఉంటారు, అనుకున్నాను.

ఆయన అన్న మాటలకి సరియైన సమాధానమివ్వలేదు. పెళ్ళి గురించి ఆయన ఎత్తేవరకూ సంపూర్ణ అంటే ఎలాంటి అభిప్రాయమూ కలగలేదు కానీ... ఇప్పుడు... దీర్ఘంగా ఆలో చించటం మొదలుపెట్టాను. రావుగారు అటుగా వెళ్ళిపోయారు. జీవితంలో అన్నింటికంటే ముఖ్యమైన ఘట్టం పెళ్ళి. దాని విషయంలో ఏమాత్రం తప్పు నిర్ణయం చేసుకున్నా జీవిత మంతా నరకాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

ఒక్కసారిగా కంటిముందు సంపూర్ణ మెదిలింది. అయస్కాంతంలాగా ఆక ర్షించే ఆమె అందం, పాలభాగంలోని మెరుపుతనం అంతా కనిపించింది. ఎందుకో పసిపిల్లలోని పసితన్వం గుర్తొ చ్చింది. ఇంకోవైపు ఆధునికంగా కద లాడే నేటి వనితలకు ప్రతిరూపంగా ఉన్న సంపూర్ణ రూపు నిలిచింది. మనసు వికలమైంది. ఈ రెండింటి గురించీ చాలాసేపు ఆలోచిస్తూ కూర్చు న్నాను. ఈ ఆలోచనలతో సంపూర్ణ మీద వాంఛ పెరిగింది. ఆమెలో ఎన్నో ఆకర్షణలు కనిపించాయి.

"ఎలాగైనా సరే! సంపూర్ణని మార్చాలి! పెళ్ళైతే మారుతుందేమో! వయసు పొంగులా పొంగుకొస్తుంటే మనసు మధురమైన క్షణాలకోసం పరిత పిస్తుంది. అందుకే సంపూర్ణలోని ఈ చలాకీతనం" అనుకున్నాను.

చాలాసేపయ్యాక నిర్ణయానికి వచ్చాను. 'అదే! నా మనసులో ఆరా ధిస్తున్న సంపూరను నా జీవితంలోకి ఆహ్వానించాలి. ఆమె మనసును అర్థం చేసుకుని ఆమెని మార్చి నా దారికి మళ్ళించాలి.'

'శరీర వ్యాయామంతో శరీరంని కాపాడుకున్నట్లే, మానసిక శిక్షణతో మనసును మార్చవచ్చు.'

రాత్రి పదిగంటలకి వచ్చింది సంపూర్ణ. ఆమెని దింపటానికి వచ్చిన వ్యక్తిమీద రెండుక్షణాలు చూపు నిలి పాను. అదేం పట్టనట్లు సంపూర్ణ ఒక్కర్తే మౌనంగా లోపలికి వచ్చింది. ఎంత ఆలోచించినా ఆమె ప్రవర్తన నాకు అర్థంకావటం లేదు.

"ఇందాక వచ్చినతను ఎవరు ?" అతి మామూలుగా అడిగాను.

"ఫ్రెండ్. అతనొక్కడే కాదు. అలాంటివారు చాలామంది ఉన్నారు నాకు'' అంది.

ఆ క్షణంలో సంపూర్ణ నాకు ఎంతో అమాయకురాలిలా కనిపించింది.

నాజూకుగా ఉండే సంపూర్ణను పదిలంగా గుండెల్లో దాచుకున్నాను. 'అందంగా ఉండే ఈమెకు ఆ భగవంతుడు లోకజ్ఞానం కూడా ఇచ్చి ఉంటే ఎంత బాగుండేది!' అనుకున్నాను.

ఆ మరునాడే ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్లు ప్రైవేట్ కంపెనీనుండి వచ్చింది క్లర్క్ పోస్ట్.

మామయ్య దగ్గరికి వెళ్ళి ఈ వార్త చెప్పాను.

"సంపూర్ణని చేసుకోవటానికి నాకె లాంటి అభ్యంతరమూ లేదు. ఆమెని ఒక దారికి తెచ్చి, నాకిష్టం వచ్చిన రీతిలో మలుచుకోగలనన్న నమ్మకం నాకుంది" అన్నాను.

"చంద్రం!" ఆనందంగా ఆయన నా చేతులు పట్టుకున్నారు. "కానీ ఓ విషయం, సంపూర్ణని కూడా కనుక్కొని ఆమె అభిప్రాయం చెప్పండి. మనసుకు నచ్చని జంట దొరికితే జీవితం నిస్సారవంతమౌతుంది" అన్నాను.

"అలాగే చంద్రం! సంపూర్ణ ఒప్పుకుంటుంది. నాకు తెలుసు" అన్నారాయన.

ఆ రోజు ఎంతో మధురమైనరోజులా అనిపించింది. ముందు జీవితమంతా నందనవనంలా తోచింది.

ఆ రోజు చల్లని వెన్నెల వింతగా తోచింది.

ఎక్కడ చూసినా అదే రూపం.

'సంపూర్ణ, సంపూర్ణ, సంపూర్ణ'

కానీ ఆ రోజంతా ఆమె నన్ను తప్పించుకు తిరిగింది.

ఆశగా ఆమెకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తున్న నాకు నిరాశే ఎదురైంది.

*  *  *

మరునాడు ఉదయం...

బాల్కనీలో నిల్చుని బయటకు చూస్తున్నాను. ఇంతలో నా వెనకగా పడిన నీడను చూసి వెనక్కి తిరిగాను.

ఎదురుగా సంపూర్ణ! ఆమె వదనం నిర్మలంగా ఉంది.

"నీతో మాట్లాడాలి" అంది.

"మాట్లాడు" అన్నాను కూర్చుంటూ. ఆమె కూడా కుర్చీ లాక్కొని కూర్చుంది.

"నన్ను ఇష్టపడే చేసుకుంటున్నావా?"

"ఎందుకలా అడుగుతున్నావు?"

ఆమె మాటలలో ఏదో కొత్తదనం ఉంది.

"ఎందుకంటే నా స్వభావం నీకు తెలియనిది కాదు. ఆ తరువాత బాధపడీ లాభం ఉండదు. నేను ఎవరిని చేసు కున్నా నా వ్యక్తిగతమైన అలవాట్లని మార్చుకోలేను. డాన్స్ నా కిష్టమైనకళ. స్టేజీ ఎక్కి ఎన్నో పర్‌ఫార్‌మెన్స్‌లు ఇవ్వాలని ఉంది. నీ సహకారం ఆశించచ్చా!"

ఆమె కళ్లెత్తి నా వంక చూసింది.

ఆమె వ్యక్తిత్వం నాకు తెలియనిది కాదు. అందుకే– "నీ మీద నాకు నమ్మకముంది సంపూర్ణా! అయితే హద్దుమీరితే నా కిష్టంలేదు" అన్నాను

"హద్దు మీరేటంత బలహీనురాలను కాను. నలుగురితో ఫ్రెండ్‌గా ఉంటే నా గురించి చెడ్డగా ఎలా భావిస్తారు?" అంది.

"సంపూర్ణా! నీ స్వభావాన్ని నేను రోజూ చూస్తూనే ఉన్నాను. నేను త్వరగా అపార్థంమాత్రం చేసుకోను, సరా!" అంటూ ధైర్యం చెప్పాను.

ఇలా పెళ్ళికి ముందే ఒకళ్లతో ఒకళ్లం నిర్ణయాలకి వచ్చేశాము.

"ఇంతకీ నీకూ ఇష్టమేనా నన్ను చేసుకోవటం" అన్నాను. అంగీకారంగా తల ఊపిందామె.

నాలుగురోజుల్లో ముహూర్తాలు నిశ్చయించి సంపూర్ణని నా దాన్ని చేశారు. అయితే నాకు మొదటిక్షణం లోనే ఒకరకమైన నిరుత్సాహం ఎదురైంది. ఎక్కడ చూసినా క్లబ్‌మెంబర్స్ ఆడా, మగా కలిసి తిరుగుతున్నారు ఇష్టం వచ్చినట్లు. సంపూర్ణ నాకంటే ఎక్కువగా వాళ్ళతోనే మాట్లాడుతోంది. ఇది సహించలేని విషయం. అయినా నిగ్రహించుకున్నాను.

ఆ రోజు గదిలో నేనూ, సంపూర్ణా మాత్రమే మిగిలాము.

నా మనసు మధురంగా ఆమె అందాన్ని చూస్తోంది. అనుభవంకోసం వయసు వేచి ఉంది.

మాట్లాడకుండా కూర్చుంది సంపూర్ణ.

''నాతో మాట్లాడటానికి అదోలా అయిపోతున్నావెందుకు? పొద్దున వాళ్ళందరితో ఎంతో బాగా మాట్లాడావుగా!''

కాస్త కటువుగానే అన్నాను. ఎందుకన్నానా అని మరునిమిషంలో బాధ పడ్డాను కూడా.

''పెళ్ళిచేసుకొన్న మొదటిరోజే బాగా అర్థంచేసుకున్నారు కదూ, నా స్వభావం" అంది.

"మరి ఎందుకు మాట్లాడటంలేదు?'' అన్నాను.

"ఏం మాట్లాడాలో తెలియక" అంది.

కాసేపు నిశబ్దం ఆవరించింది.

"పొద్దున వచ్చినవారంతా ఎవరు?'' అన్నాను.



''ఫ్రెండ్స్.''

"క్లబ్ ఫ్రెండ్సా." మళ్ళీ అనుకోకుండానే హేళన ధ్వనించింది నా కంఠంలో.

"అవును" అంది.

నా మనసులో గాలిదుమారం చెలరేగుతోంది.

''నువ్వు నిజంగా మనసుపడే నన్ను చేసుకున్నావా? "

అనుమానం తీరటానికి అడిగాను.

"ఎందుకలా అడుగుతున్నావు?" కాస్త నిదానంగా అడిగింది.

''ఊరికేనే'' అన్నాను.

''మొదట కాసేపు సంశయించాను క్లర్క్‌వి కదా అని. కానీ నాన్నగారు అయిన సంబంధం నాకు మంచిదన్నారు. ఒప్పుకున్నాను'' అంది.

ఆమెనుండి నేనాశించింది ఒకటైతే ఆమె జవాబు మరొకటి.

"అదేం అలా ఉన్నావు?'' అని ప్రశ్నించింది.

''ఏంలేదు, ఎలా ఉన్నాను?" అన్నాను.

నా ముఖంలోకి వేడిరక్తం ఉప్పెనలా పొంగింది.

"అసలు నామీద నీకెలాంటి అభిప్రాయం ఉంది?"

''మంచి అభిప్రాయం ఉందికాబట్టే ఎంతోమంది క్లబ్ ఫ్రెండ్స్ చేసుకుంటామన్నా చేసుకోలేదు" అన్నది.

"సంపూర్ణా!" ఆమెని హృదయానికి హత్తుకున్నాను. సంపూర్ణని గెలుచుకున్నానన్న తృప్తి నా అణువణువులో చిందులు వేస్తోంది.

జీవితంలో కొన్ని అతి విలువైన వస్తువులు మన కంటబడ్డాక దీన్ని నిర్లక్ష్యంచేస్తూ ఇన్నాళ్లూ ఎలా ఉన్నామా అన్న భావన కలుగుతోంది. సంపూర్ణ సన్నిధిలో నాకూ అలాంటి భావనే కలిగింది.

ఆమె నాకోసం పవిత్రంగా దాచిన కన్నెత్వాన్ని అతి సున్నితంగా దోచుకున్నాను.

తీయని అనుభవంతో తెల్లవారింది.

* * *

హాల్లో ఫోన్ మ్రోగింది.

మ్రోగుతూనే ఉంది. నాలుగయిదు సార్లు మ్రోగాక పక్కకి తిరిగి చూశాను. సంపూర్ణ నిద్రపోతోంది.

వెళ్ళి రిసీవర్ అందుకున్నాను.

అవతలి వైపునుండి మగకంఠం. అంత చల్లటివేళలోనూ ఒళ్ళంతా చెమట పట్టింది.

"సంపూర్ణ ఉందా!" ఆ కంఠం తిరిగి అంది.

''ఎవరు మాట్లాడుతున్నారు?"

"ప్రకాశ్, క్లబ్ ప్రెసిడెంట్."

"సారీ, నిద్రపోతోంది."

టక్కున ఫోన్ పెట్టేశాను. ఇలా ఫోన్ రావటం ఇది మొదటిసారి కాదు, నాలుగోసారి. నాదీ అనుకున్న సంపూర్ణ ఇంతమందితో ... ఛీ ఛీ... పవిత్రత లేదు అనుకున్నాను.

వెఱ్ఱి ఆవేశం వస్తోంది.

''ఎవరు ఫోన్‌చేశారు?" మగత నిద్రలోనుండి లేచి అడిగింది సంపూర్ణ.

"నీ ఫ్రెండట. పనిలేదూ వాళ్ళకి నీతో తిరగటంకంటే..." విసుగ్గా అన్నాను.

"వాళ్ళు ఇంట్లో కూర్చునే రకాలు కారు. సరదాగా ఎన్నో రంగాల్లో ప్రవేశిస్తారు."

"అందుకా నీలాంటివారు తోడుంటే మరీ ఉత్సాహంగా..."

"మాట్లాడే ఓపిక నాకు లేదు కానీ ఎవరు ఫోన్ చేశారు?"

"ప్రకాశ్‌ట."

"ప్రకాశా?" ఉత్సాహంగా ఆమె లేస్తూంటే చిర్రెక్కేంత కోపం వచ్చింది.

సంపూర్ణకి ఎలా నచ్చచెప్పాలి? ఆమె అంతర్యం నాకు బొత్తిగా అవగాహన కావటంలేదు. మనసు వేగిపోతోంది.

"నువ్విప్పుడు వెళ్ళద్దు సంపూర్ణా!" కాస్త నిదానంగా అన్నాను.

"వెళ్ళాలి, తప్పదు. ఇంకో వారం రోజులలో ప్రోగ్రాం ఉంది'' అంది.

"ఎవరిది?" నివ్వెరపోతూ అడిగాను.

"నాదే" అంది.

"మళ్ళీ డాన్సర్‌గా స్టేజీ ఎక్కుతావా?'' అన్నాను.

''ఆఁ తప్పేముంది! ఏదో స్కూల్‌కి డొనేషన్ ఇస్తారట. అందుకే నన్ను అదేపనిగా ఆహ్వానించారు."

"నా కిష్టంలేదు సంపూర్ణా! నువ్వు డాన్స్ చేస్తే నేను సహించలేను.''

ఆమె అదోలా నా వైపు చూసింది. సూటిగా గుండెల్లోకి చొచ్చుకుపోయినట్లు చూసే చూపది.

"ఎందుకు? పెళ్ళప్పుడు నా కళారాధనకి అడ్డురానన్నావుగా!''

"అందుకని భర్త ఇచ్చిన స్వేచ్ఛని ఇలా దుర్వినియోగపరుస్తున్నావన్న మాట."

ఆమె నిర్లక్ష్యంగా చూసింది.

అంతే! నాలోని ఆవేశం ఒక్కసారిగా పైకి పొంగింది.

ఆమె చెయ్యిపట్టి గబుక్కున పక్కన కూర్చోపెట్టాను.

"నువ్వు వెళ్ళద్దు సంపూర్ణా!ఎందుకో నాకు నువ్వలా తిరిగితే ఇష్టంలేదు" అన్నాను దగ్గరికి తీసుకుంటూ.

"అనుమానమయితే తమరూ రావచ్చు." సీరియస్‌గా ఉన్న నా ముఖంలోకి చూసి నవ్వింది.

"జోక్స్‌కిది సమయంకాదు. నువ్వు వెళ్ళద్దు. నేనూ రాను. అలా నైట్ షోకి వెళ్దాం." బ్రతిమాలుతూన్న ధోరణిలో అన్నాను.

"ఈ వేళ కుదరదులే? నేను బయటకు వెళ్ళాలి."

ఆమె లేచి వెళ్ళిపోయింది. 'భర్త అనే లక్ష్యంకూడా లేదు అసలు. ఆస్తి, కారు అన్నీ ఉన్నాయని గర్వం. ఈమెని చేసుకోవటం నాదే తప్పు.'

మధ్య తొమ్మిదిగంటల కోసారి లేచి వెళ్ళి చూశాను.

ఆమె రాకలేదు. ఇంకో గంట ఆగి మళ్ళీ లేచి చూశాను. లాభం లేకపోయింది.

ఈసారి పదకొండు గంటలకి కింది నుంచి మావయ్య తలుపు తెరిచినట్లున్నారు. మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమిటమ్మా! ఇంత రాత్రివేళ! అబ్బాయి ఇంట్లో ఉన్నప్పుడు...అసలే ఒంట్లోకూడా బాగా లేదట."

'సంపూర్ణకి ఎంతమంది చెప్పినా నా సంగతి పట్టదు. క్లర్క్‌నని చిన్న చూపేమో!'

"ఎలా ఉంది ఒంట్లో" అప్పుడే వచ్చిన సంపూర్ణ అడిగింది.

మాట్లాడలేదు నేను. సంపూర్ణని మార్చాలని చూస్తూన్న తరుణంలో తిరిగి నేను ఏ కాస్త చొరవ ఇచ్చినా తిరిగి యథాప్రకారం అవుతుందన్న భయంతో కళ్ళు మూసుకున్నాను.

''ఎలా ఉందంటే...'' నా పక్కనే కూర్చుంటూ అడిగింది.

"తలనొప్పిగా ఉంది కానీ పోయి పడుకో" అన్నాను.

"అమృతాంజనం వ్రాయనా?"

ఏమీ అక్కరలేదు. ముందవతలికి వెళ్ళు." కోపంగా అన్నాను.

"నేను వెళ్ళేంతవరకూ ఏ అనారోగ్యమూ లేదు కదా, ఇప్పుడు..." అంది.

కాసేపు మౌనంగా ఉన్నాక-

"నా హృదయంలో నీ గురించి జరుగుతున్న సంఘర్షణ భరించలేకుండా ఉన్నాను. నువ్వెలా ఉన్నా నా కనవసరం. నీకు క్లర్క్ భార్యగా ఉండటం ఇష్టంలేక, ఆఫీసర్స్..." ఆపేశాను.

"మాట పూర్తి చెయ్యి" అంది.

"నేను నా నోటితో చెప్పలేను."

''చెప్పకపోతే తెలుసుకోలేనంత అమాయకురాలను కాను. కానీ క్లర్క్ భార్యగా ఉన్నందుకు నాకేం తక్కువగా ఉన్నట్లు భావించటంలేదు. పెద్ద బంగళా, కారు అన్నీ ఉన్నాయి. నాకింకేం కావాలి?" అంది.

''ఈ ఆస్తితో, అంతస్తుతో నా ప్రేమను కొనలేవు సంపూర్ణా! నాకు కావలసింది నన్ను ప్రేమించే హృదయం. నీకవన్నీ అర్థంకావుగానీ దయచేసి వెళ్ళు."

సంపూర్ణ మౌనంగా వెళ్ళిపోయింది.


ఆ రోజు రాత్రంతా నాకు నిద్ర లేదు. మధ్య నాలుగు గంటలకి వచ్చి బాల్కనీలో కూర్చున్నాను. 'ఎలా, సంపూర్ణని ఎలా మార్చాలి' ఇదే నా మనసులో ప్రశ్న! దీనికి జవాబే మరునాటినుంచీ నేను అమలులో పెడుతున్న పనులు!

* * *

ప్రేమ అనేది మనసుకు సంబంధించిన విషయం. నేను ఇప్పుడు సంపూర్ణలో నా మీద ప్రేమబీజం నాటాలి. దానియొక్క ప్రభావం ఎలా ఉండాలీ అంటే సంపూర్ణ నా కోసం ఏం చెయ్యటానికైనా సిద్ధపడాలి.

అందుకే ఆ రోజు ఎంతో ఉత్సాహంగా ఇంటికి వచ్చాను. అద్దంలో తన ప్రతిబింబం తనివితీరా చూసుకుంటూ, మధ్యమధ్యలో పౌడర్ వ్రాసుకుంటోంది సంపూర్ణ.

అసలు సంపూర్ణకి ఎలా డ్రెస్ చేసుకోవాలో బాగా తెలుసు. అందుకే ఇంట్లో ఉన్నప్పుడు నైలెక్స్ చీరలు కట్టి ఒక




జడ వేసుకుని ఎంతో సాధారణంగా ఉంది. పెళ్ళిళ్ళ కెళ్ళేటప్పుడు పట్టు చీర, నగలు అన్నీ అలంకరించు కుంటుంది. ఇంక క్లబ్‌లకి వెళ్ళేటప్పుడు సన్నటి జార్జెట్ చీరనో, షిఫాన్ చీరనో కట్టేస్తుంది. అందుకే ఈ రోజు సంపూర్ణ డ్రెస్ చూస్తూనే తెలుసు కున్నాను — 'క్లబ్ కెళుతోంది' అని. అందుకే నాలోని ఉత్సాహం చల్లారి పోయింది.

"ఎక్కడికి?" నీరసంగా అడిగాను.

"క్లబ్‌కి. ఈ రోజు ఆటలపోటీ లున్నాయి. రాకూడదూ!" అంది.

"ఆటలపోటీకి నువ్వెందుకు? టికెట్స్ రిజర్వ్ చేయించాను. రవీంద్ర భారతిలో ఏదో తెలుగునాటకం ఉంది" అన్నాను.

"అరె చాలా ముఖ్యమైన పనిమీద వెళుతున్నాను. రాకపోతే వాళ్ళకి కోపం వస్తుంది."

"నువ్వు నాటకానికి రాకపోతే నాకూ కోపం వస్తుంది." అన్నానామె చెయ్యి పట్టుకుంటూ. సెంట్ వాసన గుప్పు మంది.

"సారీ ఈ రోజు రాలేను" చెప్పు లేసుకోవటానికి లేచింది. రోషం నా నరనరాల్లో మెలిక తిరిగి హృదయం భగ్గుమనేలా చేసింది.

ఆవేశంగా, బలంగా ఆమెని లాగాను. అనుకోని ఆ ప్రవర్తనకి బిత్తరపోయింది సంపూర్ణ. ఒక్క ఉదుటున నా దగ్గర కూర్చుండిపోయింది. సంపూర్ణని కదల నివ్వకుండా గట్టిగా అదిమిపట్టుకుని ఆమె ముఖాన్ని గుండెలకి ఆనించాను.

ఏదో తెలియని హాయి కలిగింది.

"మేకప్పు చెరిగిపోతుంది, వదలండి" అంది.

"ఉఁహుఁ." చేతులు మరింత బిగించాను.

సంపూర్ణ ఒక్కసారిగా తన బల మంతా ఉపయోగించి చేతులు దూరం జరిపి లేచి నిల్చుని అద్దంలో తన ప్రతి బింబం చూసుకుంది.

షర్ట్ మీద పడిన బొట్టు ముద్ర, కాటుక ముద్రలు, లిప్‌స్టిక్ అన్నీ చూసుకుని సంపూర్ణ వైపు తిరిగాను.

"హుఁ...భార్య అంటే ఇలా ఉండాలి కాబోలు" విసుగ్గా ముందుకు నడిచిందామె.

ఎందుకో ఆ క్షణంలో సంపూర్ణ అక్కడినుంచి ఎప్పుడు వెళ్ళిపోతుందా అనిపించింది.

సంపూర్ణ వెళ్ళాక అనుకున్నాను– 'నా మొదటి ప్రయత్నం వృథా అయింది. సంపూర్ణ నాకు లొంగలేదు.' అని.

* * *

"నా డాన్స్ ప్రోగ్రాం ఈ రోజే. నాతోపాటు రావాలి."

గిరుక్కున వెనక్కి తిరిగి చూశాను. ఎటువంటి డాన్స్ డ్రెస్‌లో సంపూర్ణ నిలబడి ఉంది.

"నేను రాలేను" అన్నాను.

"రాకపోతే ఊరుకోను" అన్నది.

కాసేపు ఆలోచిస్తూండిపోయాను. సంపూర్ణదగ్గిర పట్టుదలగా ప్రవర్తించకూడదు. 'నిలకడమీద మనసు మార్చాలి.'

అందుకే ఆమెతోపాటే బయలుదేరానుకా సేపటికి కారు క్లబ్ ముందాగింది.

ఎంతోమంది జనంతో కిటకిటలాడుతోంది హాలు. ఈ క్లబ్‌కి రావటమనేది ఓ వ్యసనంలాంటిది. ఒకసారి దానికి అలవాటయిన మానవులు ఇంక జన్మలో దానిని మరచిపోలేరు. పంచరంగుల ప్రపంచం సృష్టిచేసి మాయలో పడేస్తుంది. అయితే ఒకసారి ఆలోచించి చూస్తే కళ్ళముందున్న మైకపు తెర తొలగక మానదు.

ఆశ్చర్యమేమిటంటే మా ఆఫీసరుగారూ, సుబ్రమణ్యం ఇంకా చాలామంది వచ్చారు.

"మీ ఆవిడట కదూ డాన్స్ చేసేది. వండర్‌ఫుల్‌గా డాన్స్ చేస్తూందట" లాంటివి వస్తున్నాయి అందరినోటినుంచి. తలవంచుకుని కూర్చున్నాను.

హావ భావాలూ, ఒంపు సొంపులు అన్నీ ఎలాంటి సంకోచం లేకుండా ప్రదర్శించి డాన్స్ చేస్తోందామె.

ఎందుకో పూర్తిగా చూడబుద్ధి కాలేదు. చటుక్కున లేచి ఇంటిదారి పట్టాను.

"అమ్మాయి ఏది చంద్రం?" రాగానే అడిగారు రావుగారు.

"అక్కడేఉంది" అన్నాను అక్కడ నుండి వెళ్ళిపోతూ.

సంపూర్ణ ఓ గంట తరువాత వచ్చింది.

"ఎందుకు మధ్యలో వచ్చేశావు! అలా నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్తే వాళ్ళేమనుకుంటారు?" అందామె ఎఱ్ఱబడ్డ ముఖంతో.

"నీ కలవాటేగా ఒంటరిగా వెళ్ళటం" వ్యంగ్యంగా అన్నాను.

"జంటగా వెళ్ళాక ఒంటరిగా రావటం అలవాటులేదు. ఇష్టంలేదు" అన్నదామె.

"ఒంటరిగా వెళ్ళి జంటగా రావటం నీ కలవాటని నాకు తెలుసు" అన్నాను.

ఆ రోజు రాత్రి నాకూ, సంపూర్ణకి అసలు ఎక్కువగా మాటలు జరగలేదు. అన్నీ పుల్లవిరుపు మాటలే.

మరునాడు నేను నిద్రలేచేసరికి సంపూర్ణ నిద్రపోతోంది. ఆమెని అలాగే ఒంటరిగా వొదిలేసి కిందికి వచ్చేశాను.

*   *   *

వారంరోజులు గడిచాయి. మా ఇద్దరి మధ్యా పూ రిగా దూరం ఎక్కువై పోతోందేమోననిపించింది నాకు.

జీవితంలో స్త్రీ మనస్సు గెలిచిన నాడే నిజమైన ఆనందం లభ్యమవుతుంది మగవాడికి. కానీ నాకా ఆనందం ఈ జన్మలో లభ్యమయ్యేటట్లు లేదు. రావుగారికి ఈ మధ్యే హార్ట్ అటాక్ వచ్చి హాస్పిటల్‌లో చేరారు.

రోజూ సంపూర్ణ ఒంటరిగా వెళ్ళి ఆయనదగ్గర కూర్చుంటున్నది.

ఓ రోజు నేను హాస్పిటల్‌లో ఉన్న సమయంలోనే వచ్చింది సంపూర్ణ.

కనీసం నా వంక కన్నెత్తైనా చూడక హార్లిక్స్ కలిపి ఆయన కిచ్చింది.

"చంద్రంకి కూడా ఇవ్వమ్మా!" నీరసంగా అన్నారు.

"నాకు వద్దు" అన్నాను.

"చంద్రం! మీ ఇద్దరికీ మధ్య సత్సంబంధం లేదని తెలుస్తోంది. ఎందుచేత ఇలా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు?" ఆయన గొంతులో దుఃఖం ధ్వనించింది.

"తప్పంతా మీ అమ్మాయిదే!" అన్నాను.

"కాదు. ఆయనదే!" అన్నది సంపూర్ణ.

నేను తిరిగి జవాబు చెప్పలేదు.

జీవితంలో ఏ మాధుర్యం లేకుండా రోజులు గడుస్తున్నా యనిపించింది.

సంపూర్ణ నాకంటే ముందే ఇంటికి వచ్చేసింది.

భారంగా ఇంటికి వచ్చిన నాకు మంచంమీద పడుకుని సంపూర్ణ కవిపించింది.

ఆమె కనులలోనుండి నీరు కారుతోంది.

"సంపూర్ణా? నీకోసం ఏం తెచ్చానో చెప్పు" పక్కన కూర్చుంటూ అడిగాను.

"ఏమో తెలియదు" అన్నది పసి పిల్లలా.

సంపూర్ణతో మాటా మాటా వచ్చినా నేను ఇంకా సంపూర్ణని ప్రేమిస్తున్నాను. అయితే నాకు కావలసింది ఆమె ప్రేమ.

"నీ కోసం చీర తెచ్చాను."

సన్నటి నైలెక్స్ చీర. పసుపు రంగు మీద చిన్న ఎఱ్ఱని పూలు.

"బాగుందా?" అన్నాను.

"బాగానే ఉంది. కానీ నాకు నల్ల రంగు చీరలు బాగుంటాయని అందరూ అంటారు కదా!"...అంది.

అంతే! ఇంక నేను మాట్లాడలేక పోయాను.

"ఈసారి అలాంటిది తెస్తానులే!" అన్నాను కాసేపయ్యాక.

అలా మా ఇద్దరి మధ్యా తిరిగి మాటలు మొదలయ్యాయి. ఆమెపట్ల నా హృదయంలో అనురాగం మొల కెత్తింది. 'ఈ అనురాగం, ప్రేమ జీవి తాంతంవరకూ ఉంటే ఎంత బాగుండును. అసలు మనుష్యులు జీవించేదీ, తపించేదీ ఇలా తోడుగా ఉంటూ, ప్రేమించే వ్యక్తుల కోసమేగా!'

ఆ క్షణంలో నాకు జీవితసత్యం తెలిసింది. ఆలోచిస్తూ ఆమెవైపు ఆరాధనగా చూస్తున్నాను.

"అన్నట్లు సంపూర్ణా! ఇందాక ఎందుకు అలా ఏడ్చావు..." అన్నాను.

"నువ్వు నన్ను అర్థంచేసుకో నందుకు" అంది,

మా ఇద్దరిలో విచిత్రం ఏమిటంటే నన్ను అర్థంచేసుకునే గుణం ఆమెకి లేదు. ఆమెని అర్థంచేసుకునే మన స్తత్వం నాకు లేదు.

"అన్నట్లు ఆ పత్రికలో మధ్య పేజీ తీసి చూడు" అన్నది.

"ఏముంది! నీ అభిమాన డాన్సర్ ఉందా!" అంటూనే తీశాను.

తీరం చేరిన కెరటం తిరిగి సము ద్రంలోకి జేరుకున్నట్లు నాలోని ప్రేమ ఒక్కసారిగా మాసిపోయింది. బాధతో కృంగిపోయాను.

'ప్రఖ్యాత డాన్సర్ సంపూర్ణతో పరిచయం' అని ఉంది.

వివిధ భంగిమలలో సంపూర్ణ ఫోటోస్.

"సంపూర్ణా! ఎన్నిసార్లు చెప్పాలి. నా కిలాంటివి ఇష్టంలేదని. అందరికీ ఫలాన అతని భార్య డాన్సర్ అని తెలియాలా?"

"నాకు డాన్స్ అంటే ఇష్టం అని తెలుసుగా!"

"అయితే!"

"ఆ రోజు నా డాన్స్ ప్రోగ్రాం అయ్యాక పత్రికా విలేఖరి ఇంటర్వ్యూ జరిపించి ప్రచురించాడు."



"నీ అనుమతి మాత్రమే సరిపోతుందా!"

"ఇది నా వ్యక్తిగత విషయం కాబట్టి అనుమతి అక్కరలేదనుకున్నాను."

"అసలు నీకు ఏ విషయంలోనూ నా అనుమతి అక్కరలేదు" అని చటుక్కున నాలుగడుగులు ముందుకు వేసిన నాకు ఫోన్‌కాల్ వినిపించటంతో ఆగిపోయాను.

"తియ్యి, నీకే వచ్చి ఉంటుంది."

"ఊహుఁ! నువ్వే తీసి చూడు" అందామె ఎటో చూస్తూ.

వంకరగా ఓ నవ్వు నవ్వి ఫోన్ తీసిన నాకు ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది. ముఖం చెమటతో తడిసిపోయింది.

ఫోన్ పెట్టేశాను.

"ఎక్కడనుంచి" సంపూర్ణ అడిగింది.

"మీ నాన్న పోయారట" బాధగా అన్నాను.

వెక్కి వెక్కి ఏడ్చేసింది సంపూర్ణ. ఆ క్షణంలో ఆమెకి ఈ లోకంలో అండని నేనే అయ్యాను. నా హృదయంలో వాలిపోయింది పసిపాపలా.

ఆమెని లాలించటం తప్ప ఏమీ చేయలేకపోయాను.

* * *

రావుగారు పోయారు.

సంపూర్ణకి ఇప్పుడు పూర్తిగా విరక్తి వచ్చేసింది. మాట్లాడినా ముభావంగా మాట్లాడుతోంది.

ఓ రోజు......

"నాకు ఉద్యోగం వచ్చింది" అంది సంపూర్ణ.

"ఏ ఉద్యోగం?"

"డాన్స్ టీచరుగా గవర్నమెంట్ కాలేజీలో!" అంది.

"సంపూర్ణా! ఇప్పుడు నీకు ఉద్యోగం చేసే అవసర మేమొచ్చింది?"

"ఈ కాలంలో ఎవరు ఉద్యోగం చెయ్యడంలేదు."

"నువ్వు చెయ్యక్కరలేదు సంపూర్ణా!"

"వచ్చిన ఉద్యోగం పోగొట్టుకో లేను. డాన్స్ టీచర్‌గా ఉంటే నా కళని నలుగురికీ పంచిన దాన్నయినా నన్న తృప్తి నాకు ఉంటుంది. అదీ గాక ఇంటికి సాయంగా ఉండవచ్చు."

"నీ సాయంకోసం ఎవ్వరూ వేచి ఉండటంలేదు. క్లర్కు భార్యగా ఉండటం నీ కిష్టంలేకపోతే ఆ ఉద్యోగంలో చేరు."

సంపూర్ణలో చలనంలేదు.

"సరే! తమరు రేపటినుంచీ ఆఫీసర్ కాబోతున్నారు'' నవ్వుతూ అన్నది.

"ఏం ప్రమోషన్ వచ్చిందా?" అన్నాను.

"వచ్చినట్లే! ఈ రోజు జాన్స్, అదే మీ ఆఫీసర్ వాళ్ళింటికి రమ్మన్నాడు. నేను మాట్లాడేసి వస్తాను."

నీకా శ్రమ అక్కరలేదు. నన్నిలా ఉండనయి చాలు" అన్నాను.

"లేదు, వెళ్తాను. ప్రమోషన్ ఇప్పిస్తాను."

"నువ్వు అతనింటికి వెళ్ళటం నా కిష్టంలేదు. అతను మంచివాడు కాదు" అన్నాను.

"నాకు తెలుసు ఎవరిదగ్గర ఎలా ఉండాలో" అంది.

సంపూర్ణకి ఏమి చెప్పినా లాభం ఉండదని తెలిసి మరి రెట్టించలేదు.

ఆ రోజు సాయంత్రం రోజూకంటే అందంగా కనిపించింది సంపూర్ణ.

గాడ్రేజ్ తెరిచి అయిదువేల రూపాయలు తీసింది.

"ఎందుకా డబ్బు?" అన్నాను.

''ఆఫీసర్ హోదాకి ఈ మాత్రం కావద్దూ?" అన్నది.

"సంపూర్ణా! అతన్ని నమ్మి వెళుతున్నావు గానీ అతను నిన్నేమైనా చెయ్యొచ్చు." ఆమె భుజం గట్టిగా పట్టుకున్నాను.

నా చెయ్యి విసురుగా తోసిందామె.

"సరే నీ ఇష్టం వెళ్లు. అయితే, డబ్బు మాత్రం లోపల పెట్టు.''

''పెట్టను.

''అతను నీకేం చేశాడని ఇంత డబ్బు! నీ అందానికి ఇదో ఆకర్షణా?"

"ఏదైనా అనుకోవచ్చు" అనేసి ముందుకు నడిచి వెళ్ళిపోయిందామె.

'ఎంత నిర్లక్ష్యం! అస లిలాంటి కొంపలో కూరుకుపోవటం ఏనాడు చేసుకున్న పాపమో కదా!'

నా హృదయంలో రగులుకుంటోంది ఆర్తి. తీరని విషాదం. ఇంతలో 'పోస్ట్'అన్న పోస్ట్‌మాన్ కేక వినిపించింది.

వెళ్ళి అందుకున్నాను.

హైద్రాబాద్‌లో ఉండే ఫ్రెండ్ సుధాకర్ వ్రాశాడు.

"చంద్రం,మా స్కూల్లో నీకు టీచరుగా ఉద్యోగం ఇప్పిస్తున్నాను. త్వరలో వచ్చెయ్యి..." అని వుంది.

మనసు ఆనందంతో ఎగిరి గంతేసింది. ఏదో ప్రశాంతత ఆవరించింది. 'వెళ్ళిపోవాలి' సంపూర్ణకి దూరంగా వెళ్ళిపోవాలి. నా లోటును ఆమెకు తెలియచెప్పాలి. అయినా అక్కడ జాన్స్, సంపూర్ణ ఒకే గదిలో... ఛీ ఛీ, 'సంపూర్ణ కెందుకు ఇలాంటి బుద్ధులు పుడుతున్నాయి. మారుతుందని కలలు కని చేసుకున్నాను. కానీ ఫలితం శూన్యం. మంచుతెరలలా కలలు కరిగిపోయాయి.'

'ఇంక అలా జరగటానికి వీలులేదు. వెళ్ళిపోవాలి. అప్పుడు సంపూర్ణ తనకి తానుగా నా నీడకి వస్తుంది. ఎడబాటును సహించగలదా ఆమె'

ఏదో నిశ్చయానికి వచ్చేసి సూట్‌కేస్ సర్దుకున్నాను. పేపరు, పెన్ తీసి వ్రాయసాగాను.

''సంపూర్ణా!

నిన్ను చేసుకుని పూర్తిగా మోసపోయాను. నాకు కావలసింది నన్ను ప్రేమించే హృదయం. నువ్వు నన్ను జీవితంలో ప్రేమించలేవు. నాకు టీచరుగా హైద్రాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. నేను వెళితే నీకు పూర్తి స్వాతంత్ర్యం వచ్చింది కదూ! నీ ఇష్టం వచ్చినంతమందితో తిరుగు. నీకు అడ్డు చెప్పేవారుండరు.

కానీ నేను నీకు చెబుతున్న ఈ విషయం మాత్రం మరచిపోవద్దు— "ఏది నిజమో, ఏది నటనో తెలుసుకోలేని మోసాలు అనేకం జరుగుతున్నాయి. నటనని చూసి నిజం అనుకుని మోసపోవద్దు. సమాజం స్త్రీకి గీసిన గీతను దాటి ముందడుగు వెయ్యద్దు."

ఇప్పటికీ మించిపోయింది లేదు. ఈ కింద అడ్రెస్ వ్రాస్తున్నాను. నువ్వు మనసు మార్చుకుని వస్తే రా!

ఉంటాను

చంద్రం"

అడ్రెస్ వ్రాసి పేపరు టేబిల్‌మీద పెట్టి, పనివాడితో, "అమ్మగారికి చెప్పు, నేను ఊరు వెళుతున్నట్లు" అని చెప్పి రైలెక్కాను

రైల్లో కూర్చున్నంత సేపూ

సంపూర్ణ ఆలోచనలే! ఉత్తరం చదువుకున్న ఆమె భావనలెలా ఉంటాయి?"

"వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టినప్పటినుంచీ సంపూర్ణ నా కెలాంటి ఆనందం ఇవ్వలేదు

ఎన్నో రోజులు సంపూర్ణకోసం సుధాకర్ వాళ్ళ ఇంట్లో వేచి చూశాను. లాభం లేకపోయింది

ఇప్పుడు వేరేగా ఇల్లు తీసుకుని ఉంటున్నాను."

చెప్పటం పూర్తిచేసి – "ఇప్పుడు చెప్పు రఘూ! నేను చేసినది తప్పా! నా భార్య నయాపైసల పతివ్రతగా ఉండక్కరలేదు. కానీ ఇలా పరాయి వాళ్ళతో తిరిగితే ఏ భర్త సహించగలడు! నాకు హోదా అక్కరలేదు. మంచిపేరు చాలు!

'ఒకవేళ నేను ఆఫీసర్‌గా అడుగు పెట్టినా అందరిలో నాకెంత చెడ్డపేరు చెప్పు! నా భార్యవలన ఉద్యోగం వచ్చిందని తెలిస్తే నాకు అవమానం కాదా! చెప్పు రఘూ!" నా చెయ్యి పట్టుకున్నాడు.

ఏం చెప్పాలి, ఎలా చెప్పాలి.

"సంపూర్ణని కలిశాక చెబుతాను చంద్రం!" అన్నాను.

వాడు రెట్టించలేదు. ఓ రెండ్రోజులు చంద్రంతో గడిపి రైలెక్కాను.

విశాఖపట్నం మరునాటి ఉదయం కల్లా చేరుకున్నాను. అడ్రెస్ పట్టుకుని సంపూర్ణ ఇంటి ముందాగాను. ముందు వరండాలో ఎవ్వరూ కనిపించలేదు. వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. నొక్కిన అయిదు నిమిషాలకి సంపూర్ణ వచ్చి తలుపు తెరిచింది.

"నేను చంద్రం ఫ్రెండ్‌ని. మిమ్మల్ని కలవటానికి వచ్చాను" అన్నాను.

"నన్నా!" ఆశ్చర్యంగా ఓసారి నా వంక చూసింది. లోపలికి వచ్చి కూర్చున్నాను.

"కాఫీ తెస్తానుండండి" అన్నది.

కాసేపు పేపరు తిరగేస్తూ కూర్చున్నాను. కాఫీ ఇచ్చిందామె.

కాఫీ తాగటం మొదలుపెట్టాను.

"మీకు తెలుసో తెలియదో గానీ ఆయనిక్కడ లేరు" అంది సంపూర్ణ.

"తెలుసు. నేను చంద్రం దగ్గర నుంచే వస్తున్నాను.

సంపూర్ణ ముఖకవళికలు మారాయి.

"ఎలా ఉన్నారాయన?" అడిగింది.

"అంతా చెప్పాడు. తప్పు ఎవరిది?" అని అడిగాడు.

"ప్రాణస్నేహితుని మాటలు వింటే తప్పు అసలు అతనిది కాదనిపిస్తుంది. కానీ తప్పంతా అతనిదే!" అంది.

కాసేపు మౌనం రాజ్యంచేసింది.

"ఈ రోజు భోజన మిక్కడే చెయ్యాలి మీరు" అంది.

"అలాగేనండీ" అన్నాను.



బాత్‌రూం చూపించాక స్నానంచేసి వచ్చాను. పదింటికి అన్నం వడ్డిం చిందామె.

"అసలు ఏం జరిగి మీ ఇద్దరూ ఇలా విడిపోయారు?" అడిగాను.

"ఆయనకి నన్నర్థంచేసుకునే గుణంలేదు. అసలేం జరిగిందంటే...."

ఆమె చెప్పటం మొదలుపెట్టింది. ఇంకో పాత్ర నా ముందు నిలిచింది. డైరీలో వ్రాసుకున్నాను.

ఈ కిందిది సంపూర్ణ పాత్ర....

సంపూర్ణ: వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టక ముందే చంద్రంకి అంతా చెప్పాను. కళారాధన నా జీవితంలో ఒక భాగమనీ, సంఘంలో నలుగురితో కలిసి తిరగటం నా సరదా అని. అతను అంతా ఆలోచించే నన్ను చేసుకుంటా నని ఒప్పేసుకున్నాడనుకున్నాను.

కానీ పెళ్ళయిన మొదటిరోజే నేను క్లబ్ ఫ్రెండ్స్‌తో కలిసి తిరిగితే సహించలేకపోయాడు.

నాకు ఫోన్ వస్తే ఇష్టం లేదు. నేను

క్లబ్‌కి వెళ్ళితే అనుమానం. ఆడదాని మీద ఆ మాత్రం నమ్మకం లేకపోతే ఎలా?

క్లబ్‌లో డాన్స్ ప్రోగ్రాం నాడు నన్ను ఒంటరిగా వొదిలేసి వెళితే అంత మందిలో నా కెంత చిన్నచూపో ఆలోచించలేడు!

నిజం చెప్పాలంటే అతనెలా ఉన్నా సర్దుకుపోదామని ప్రయత్నించాను.

అతనికోసం, అతన్ని ఆఫీసర్‌ని చెయ్యటంకోసం జాన్స్ దగ్గరికి వెళితే అనుమానం. నేనంత తెలివితక్కువ దాన్ని కాదు. అయిదువేలు ఇచ్చినట్లు వ్రాయించి అతని సంతకం కూడా తీసుకున్నాను కానీ ఇతనిలో అంత ఆవేశం ఉంటుందనుకోలేదు. ఇంటికి వచ్చేసరికి వెళ్ళిపోయాడు ఆఫీసర్‌లాంటి హోదాగల ఉద్యోగం వదులుకుని టీచర్‌గా వెళ్ళాడు ఆ తరువాత క్లబ్‌కి వెళ్ళినప్పుడు ఎంతో మంది నన్ను చిన్నచూపు చూశారు. ముఖ్యంగా జాన్స్ ముందు అవమానమైపోయింది.

ఇంక కళ విషయం. నేను స్టేజీ మీదికి వెళ్ళటం ఇష్టంలేదు. పత్రికలో నా ఫోటో పడితే ఇష్టంలేదు.

భార్యకి ఉన్న కోరికలు నెరవేర్చుకో కూడదు. అతని కోరికలకి తగ్గట్టుగా నన్ను మార్చాలని చూస్తాడు. ఒకళ్ల కోసం అభిరుచులను చంపుకుని బ్రతకలేను.

ఈ జీవితంలో నా ఆశయం డాన్సర్‌గా పైకి రావటం. దాన్ని ఎవ్వరూ ఆపలేరు.

ఇంకా నన్ను పరీక్షించటాని కన్నట్లు అడ్రెస్ ఇచ్చి రమ్మన్నాడు, ఇక్కడ కళారాధనకి ఎంతో బాగుంది. పైకి వెళుతున్న ఈ తరుణంలో నా ఆశలని వదులుకోలేదు, అతను ఇంటినుండి వెళ్ళిపోవటమే నన్నెక్కువగా బాధించింది.

ఆ సంఘటనతో అతనిపట్ల ఓ రకమైన నిరసన కలిగింది. మనసుకు నచ్చని జంటతో అనుక్షణం బాధపడే కంటే జీవితాంతం ఇలాగే ఉండటం నయమనిపించింది.

ఇప్పుడు నన్ను అమెరికావాళ్ళు ఆహ్వానించారు. ఇంకో రెండు నెలలలో అమెరికా వెళుతున్నాను. వీలైతే అక్కడే సెటిల్ అయిపోతాను అంది.


"అంటే మీరింక చంద్రంతో..." అనుమానంగా అడిగాను.

"ఉండలేను" అంది కృతనిశ్చయంతో.

కాసేపయ్యాక అందామె - "తప్పెవరిదో చెప్పండి" అని.

"వెళ్ళాక ఉత్తరం వ్రాస్తాను" అన్నాను.

ఆ రోజు నేనే కాదు, సంపూర్ణ కూడా అన్యమనస్కంగానే ఉంది.




ఆ రోజు రాత్రి ఆమె ఆతిథ్యం తీసుకుని నా స్వస్థలంకి ప్రయాణ మయ్యాను.

ఇప్పుడు వారిద్దరికీ ఉత్తరాలు వ్రాయాలి.

ఏమని?

తప్పు ఎవరిదో చెప్పటం నాకు సాధ్యం కాలేదు. ఉత్తరాలు వ్రాశాను.

"చంద్రం,

ఆలోచించాను. తప్పు నీదీ కాదు. ఆమెదీ కాదు. పరిస్థితులది. ఒకరి నొకరు అర్థంచేసుకుంటే ఇలాంటివి రావు కదా! సంపూర్ణని అర్థంచేసుకుని, ఆదరంగా నీ ఇంటికి తీసుకొచ్చుకో! త్వరపడు. ఆమె త్వరలో అమెరికా వెళ్ళిపోతోందిట. మీరిద్దరూ కలిసి ఉండే మార్గం ఆలోచించుకోండి. ఉంటాను. నీ శ్రేయస్సు కోరేవారిలో నేనూ ఒకడిని - రఘు.

అలాగే సంపూర్ణకి వ్రాశాను.

"సంపూర్ణకి,

తప్పు ఎవరిదో నేను చెప్పలేనేమో ననిపిస్తోంది. చంద్రంని అర్థంచేసుకుంటే మంచిది. మీరిద్దరూ జీవితాంతం కలిసి ఉండాలని ప్రార్థిస్తున్నాను - రఘు."

ఇలా ఈ రెండు పాత్రలకి పరిష్కారమార్గం సూచించాను. నాకు కావలసింది వారిద్దరూ చిలకా గోరింకల్లా ఉండటమే.

ఇలా నా ముందు నిలిచిన పాత్రలని వ్రాసి కలాన్ని ఆపాను. ఇప్పుడు ముగించాలి. వీరిద్దరినీ కలపాలా, విడదీయాలా?

ఆలోచించాక ముగింపు ఇలా వ్రాశాను - నా ఉత్తరం చదువుకుని సంపూర్ణ భర్తకోసం అమెరికా వెళ్ళటం

మానుకుంటుంది. చంద్రం సంపూర్ణ కోసం విశాఖపట్నం వెళ్తాడు. ఇద్దరూ తిరిగి కొత్తజీవితం ప్రారంభిస్తారు. ఇద్దరి జీవితాలలో భానూదయమైంది.

ఇలా పాత్రలకి రాజీ కుదిర్చాను. అంటే కథ ముగించాను.

కథ పత్రికలలో ప్రచురింపబడింది. నేను ఉత్తరాలు వాళ్ళకి డైరెక్ట్‌గా కాకుండా పత్రికా ముఖంగా వ్రాశాను. ఎందుకంటే రచయితగా నేను చెబితే మారతారన్న నమ్మకం నాకుంది. 'ఈ కథ చదివి వాళ్ళు మారితే నాకంతే చాలు' అనుకున్నాను.

ఇంతలో పోస్ట్‌మాన్ వచ్చి రెండు ఉత్తరాలు ఇచ్చి వెళ్ళాడు. ఆత్రంగా అందుకున్నాను.

ఒకటి చంద్రం దగ్గరనుంచీ, ఇంకోటి సంపూర్ణ దగ్గరనుంచీ వచ్చాయి. ఎంతోమంది పాఠకులు అభినందనలు తెలుపుతూ వ్రాశారు. కానీ ఏ ఉత్తరాలూ ఇంత ఉత్సాహంగా అందుకోలేదు. ముందు చంద్రం ఉత్తరం చింపాను.

"రఘూ!

నీ కథద్వారా మమ్మల్ని మారుద్దామని అనుకుంటే అది వ్యర్థ ప్రయత్నం. నేను సంపూర్ణకోసం మారలేను. నాకూ మనసుంది. నలుగురితో కలిసి సంపూర్ణ తిరిగితే నేను సహించలేను. అనవసరంగా అర్థంలేని పరిష్కారమార్గం సూచించావు. నేను సంపూర్ణతో కాపురం చెయ్యలేను. తప్పు పరిస్థితులదీ కాదు. నాదీ కాదు. సంపూర్ణది. ఉంటాను – చంద్రం."

విసురుగా ఉత్తరం పడేశాను పక్కకి.

'సంపూర్ణ అయినా మారి ఉంటుందా!'

సంపూర్ణ ఉత్తరం చింపాను.

"రచయితగారికి,

మీ కథ అంతా నచ్చింది. పాత్రలని బాగా నడిపించారు. నేను చెప్పిన ప్రతి వాక్యం వ్రాశారు. కానీ మీరు వ్రాసినట్లుగా నేను మారలేను. నాది మొదటినుంచీ తలవంచని వ్యక్తిత్వం. అన్నట్లు రేపే నా అమెరికా ప్రయాణం. తప్పు నాది కాదని మీకు తెలుసుగా! మీరు ఫ్రెండ్ కోసమని తప్పు అతనిది కాదన్నారు కదూ! ఏదేమైనా పరవాలేదు. నాకు తెలుసు తప్పు నాది కాదని. ఉంటాను - సంపూర్ణ"

విరక్తిగా ఆ రెండు ఉత్తరాల వైపు చూస్తూండిపోయాను. కథలో జీవితం సుఖాంతం చేశాను. కానీ నిజజీవితంలో దుఃఖాంతమే!

తప్పు ఎవరిదో నిర్ణయించలేకపోయాను. పరిష్కారమార్గం సూచించినా రాజీ కుదర్చలేకపోయాను.

పాఠకులారా! మీరు చెప్పండి, 'తప్పు ఎవరిది?' ఇలాంటి పాత్రలు మీ ముందుకు వస్తే మీరేం నిర్ణయిస్తారు?

---